# బంధవిముక్తి

'వజ్రపాణి'

ఆనాడు ఒకటో తారీఖు!

గవర్నమెంటు ఉద్యోగులకు ఈ ఒకటో తారీఖు ఎంత మహత్తరమైన దినమో వేరే వర్ణించడం అనవసరం. ఆనాడు వాళ్ళముఖాలు ఓ దివ్యతేజస్సుతో కళకళలాడుతుంటాయి. ఆ పవిత్రదినంకోసమే—ఎండనక, వాననక, రోగం వచ్చినా, రొష్టు వచ్చినా అలాగే పనుల్లోకి పోతుంటారు వాళ్లు. ఈ రోజుల్లో కాళిదాసే బ్రతికివుంటే "ఒకటో తారీఖు సందేశం" అనే మరో ఉత్తమ ఖండకావ్యం రాసేవాడే!

సంజీవరావు కలెక్టరేట్‌లో ఓ గుమాస్తా. నెల ముప్ఫైరోజులూ పనిచేస్తే ఒకటో తారీఖున దయతలచి అతని చేతుల్లో ఎనభైరూపాయలు పెడుతుంది ప్రభుత్వం. అతను బహు కుటుంబి. అంటే, వృద్ధుడని కాదు. యువకుడే! పాతికేళ్ల నిండు యౌవనంలో వున్న నవయువకుడు!

ఏం లాభం? ఇంత చిన్నవయస్సులోనే నుదురు ముడుతలు పడ్డది. కళ్లల్లోని తేజస్సు అంతరించిపోయింది. నడుంలో కొంచెం గూనికూడా వచ్చినట్టు—ప్రేక్షకులకు దృశ్యాదృశ్యంగా కనిపిస్తుంది. అతను నవ్వి ఎన్ని సంవత్సరాలైందో ఇతమిత్థమని నిర్ణయించే ఆధారాలు దొరకటంలేదు. తలకు రెండుప్రక్కలా వెండ్రుకలు తెలుపెక్కుతున్నయ్. ఎంచేత?

అతను బహు కుటుంబి అని చెప్పనే చెప్పాను. అతనిమీద ఆధారపడి జీవించేవాళ్లు ఆరుగురు. వాళ్ల జాబితా యీ విధంగా వుంటుంది: అతను సరేసరి! అతని భార్య, తండ్రి, తలచెడిన అక్క, చెల్లెలు, కుమార్తె. ఈ కుమార్తె మూడేళ్ల పిల్ల.

ప్రొద్దుటినుండీ అతను అదో మోస్తరుగా వున్నాడు. షుమారు తొమ్మిదిగంటలకు సేఫ్టీరేజర్‌తో క్షౌరకల్యాణం ముగించి, దొడ్డిలో నూతిదగ్గర నాల్గు చేదల నీళ్లు దిమ్మరించుకుని "టైమైపోతోంది! టైమైపోతోంది!" అంటూ వంటింట్లోకి పోయాడు. అప్పటికతని భార్య బియ్యం కడుగుతోంది. భర్త గుర్రురిమి చూచాడు: "ఇప్పుడా బియ్యం కడిగేది? టైమెంతయిందో తెలుసా?" స్వర్ణ—అతని భార్య—మౌనం తాల్చింది. "నీతోనే మాటాడేది! గోడలతో కాదు! అసలు నీ వుద్దేశమేమిటీ? వేళకింత వండి వార్చటం కూడా కష్టమైపోతోందన్నమాట!"

స్వర్ణ—భర్త కళ్లల్లోకి దీనంగా చూచింది. ఆమె చూపులలోని భావమేమిటో, అసలు చూపుల్లో కూడా భావాలనే పదార్థాలు ఉంటవో, లేవో కూడా అతనికి తెలీదు, తిరిగి, గర్జించాడు.

"నామీద అలా విరుచుకపడతారేం? ఇంట్లో బియ్యం నిండుకున్నయ్. ఇరుగు పొరుగులదగ్గర ఇదివరలో చేసిన అప్పులే యింకా తీర్చలేదు. క్రొత్తపేటవెళ్లి సరోజినిగారిదగ్గర రెండుశేర్లు తెచ్చేసరికి యీ వేళయింది. ఉడకడం ఎంతసేపూ? మీరు బట్టలు వేసుకోండి!" అంది.

"ఏఁవిటీ? నిన్నకాక మొన్ననే కదుటే పది శేర్లబియ్యం తెచ్చానూ?" ఆశ్చర్యపోయాడు భర్త.

"ఐతే మీ రనే దేఁవిటీ? ఒక్కతెనే—గుడినీ, గుడిలోని విగ్రహాన్ని దిగ్రమింగేందుకు నేనేం రాక్షసినా? ఆపూటా యీపూటా కలిపి రోజుకు పన్నెండు కంచాలు లేవాలి! పదిశేర్ల గింజ లేం భాగ్యం?" అంది స్వర్ణ.

ఏతత్ సుముహూర్తమునకు అభినయపూర్వకంగా రంగంలోకి ప్రవేశించింది—సంజీవరావు విధవ అక్క జానకమ్మ. చిత్రవిచిత్రంగా చేతులు త్రిప్పుతూ—"ఐతే మేమేనుటె రాక్షసులం! నోటికి ఎంతకూతవస్తే అంతకూతా కూసెయ్యడమేనా?" అని సాగదీస్తూ హుంకరించింది.

"నేనలా అనలేదు. మీరు అయినదానికీ కానిదానికీ గిల్లి కజ్జాలు పెట్టుకోవాలని చూస్తున్నట్టుంది. మేం ఉభయులమూ ఏదో కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నాం!" పుల్ల విరుపుగా జవాబిచ్చింది స్వర్ణ.

జానకమ్మకు శివమెత్తింది. ఆమెలో నిద్రిస్తోన్న కైకా, మంథరా ఒక్కసారిగా మేల్కొన్నారు. భరతనాట్య భంగిమలు ప్రదర్శిస్తూ, "విన్నావుట్రా తమ్ముడూ! ముందు పుట్టిన చెవులకంటె, వెనుకవచ్చిన కొమ్ములే వాడిట! అట్లా వుంది దీని ధోరణి. ఐతే, నే నే పరాయిదాన్నన్నమాట! మమ్మలి నంపరినీ యిలా ఉసురుపెడుతోంది—దీనికేం పోయేకాలం వచ్చిందో కాని!" అని మెటికలు విరిచింది.

"చూచారా! మీ అక్కగారి ధోరణి! ముండా భగవంతుడు నన్ను తీసుకుపోయినా బాగుండేది!" అన్నది స్వర్ణ.

అంతటితో యుద్ధం ప్రారంభమైంది. ఇంట్లోని వ్యక్తులందరూ రంగంమీద ప్రత్యక్షమయ్యారు. కొందరు జానకమ్మనూ, కొందరు స్వర్ణనూ సమర్థిస్తున్నారు. మనదేశపు వైదేశిక విధానం లాగున తటస్థంగా వుండిపోయినవాళ్ళు ఇద్దరు మాత్రమే! ఒకడు సంజీవరావు. రెండో వ్యక్తి—అతని చెల్లెలైన సుహాసిని.

ఇరుపక్షాలూ ఓ పదిహేను నిమిషాలు వాగ్యుద్ధంలో పాల్గొన్నాయి. న్యాయం స్వర్ణపక్షాన్నే వున్నప్పటికీ—గయ్యాళిగా కీర్తిపొందిన జానకమ్మ కుతర్కంలో ప్రౌఢమార్గాల్ని అందుకున్నది. ఆడబడుచు సవ్యాపసవ్యంగా ప్రయోగించిన అవమానాస్త్రాలకు తాళుకోలేకపోయింది స్వర్ణ. తన భర్త అయినా తనకు సహాయపడకపోవటంతో ఆమె సిగ్గుతోనూ, అవమానంతోనూ క్రుంగిపోయింది. ఆమె కళ్ళలో నీరు తిరిగింది. కన్నీరు చూచిన భర్తృహృదయం కరిగి, వాగై, ప్రవహించింది.

"నన్ని యింట్లో ఉండమంటారా? లేకపోతే సన్యాసం పుచ్చుకుని ఏ కాశీకో పొమ్మంటారా?" అని అతను కేకలు వెయ్యటంతో రభస తాత్కాలికంగా ఉపశమించింది. త్వరత్వరగా బట్టలు వేసుకుని, భోజనమైనా చెయ్యకుండా నే వెళ్ళిపోబోతూండగా స్వర్ణవచ్చి, త్రోవ కడ్డుగా నిల్చుని, కన్నీళ్ళపర్యంతమై "మీకు కూడా నామీద కోపమేనా? రండి! అన్నం వార్చాను. ఇన్ని మజ్జిగనీళ్ళయినా వేసుకుని కొంచెం ఎంగిలి పడండి!" అని దీనాతిదీనంగా అడిగింది.

"ఎబ్బే, నాకు తిండెందుకూ? నేను మనిషిని కానుగా! యంత్రాన్ని! గాడిదను! అసలు నేను సుఖపడటానికి పుట్టలేదుగా! జీవితమంతా ఏడ్వమని నా నొసటను రాశాడు భగవంతుడు! లే! త్రోవ తప్పుకో! టైమైపోతోంది!" అని కోపంగా స్వర్ణను ప్రక్కకు నెట్టి ముందడుగు వేశాడు.

"అబ్బబ్బబ్బబ్బ! మీరంతా కలిసి వాడి ప్రాణాలు కొరుక్కుతింటున్నారే!...ఆఁ! ఒరే, అబ్బాయ్! ఇటు చూడూ! ఇవాళ ఫస్ట్ తారీఖు కదూ! సాయంత్రం యింటికి వచ్చేటప్పుడు ఓ వంద లంక పుగాకు చుట్టలు పట్రా! మొన్నటిమాదిరివి తెచ్చేవు సుమీ! లోపల పుగాకు కాడలు పెట్టి చుట్టారు. కాల్చలేక దవడలు పీక్కుపోతున్నయ్" అన్నాడు తండ్రి.

సంజీవరావు "అలాగే" అని మరో అడుగు ముందుకు వేశాడు.

"ముండా భగవంతుడు నన్నన్నా తీసుకుపోయాడు కాడు. నావల్ల నేకదా తిండీ, తిప్పలూ లేకుండా నువ్విట్లా ఆఫీసుకుపోవాల్సి వచ్చింది.... ఒరే, తమ్ముడూ! బట్టలన్నీ చిరిగి, వరుగులైపోయాయిరా! ఈనెల అయినా ఒకట్రో రెండో రామబాణం మార్కు సైనుపంచెలు కొనిపెట్టరా! ఆడముండనిరా! సిగ్గుతో ఛస్తున్నాను! నన్ను ఉసురుపెట్టడం మీకు క్షేమం కాదురా!" అన్నది జానకమ్మ.

సంజీవరావు తిరిగి "అలాగే" అని యింటిమెట్లు దిగుతూండగా అతని చెల్లెలు సుహాసిని, "అన్నయ్యా! వచ్చేప్పుడు 'ఫైవ్ పండిట్స్ నోట్సు' మరచిపోకు! క్లాసులో ఒక్క తెలుగు పాఠమూ అర్థంకావడంలేదు. ఆ తర్వాత నీ యిష్టం! నా బట్టలుకూడా పేలికలైపోయాయి. క్లాసులో అంతమంది మగాళ్ల మధ్య కూర్చోవటానికి సిగ్గువేస్తోంది!" అంది.

కసాయివాడి చేతిలో కత్తి చూచి, ప్రాణాల మీద తీపి పూర్తిగా విడనాడుకున్న మేకపిల్లలాగు

"అలాగే" అని మరోసారి అని, ఓసారి వెనక్కి తిరిగి చూచాడు సంజీవరావు. స్వర్ణ చంటిబిడ్డ నెత్తుకుని, అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తోన్న కన్నీటి ధారల్ని పైట చెరగుతో తుడుచుకుని, లేనినవ్వును తెచ్చిపెట్టుకుని భర్త వైపు అధోవిఘంగా చూచింది. ఆ చంటిబిడ్డకు కడుపులో 'బల్ల' పుట్టింది. పిల్ల నానాటికీ నీరసించి పోతోంది.

అడుగుల్లో అడుగులు వేసుకుని కోర్టుకు చేరుకు న్నాడు సంజీవరావు. అప్పటికే పది దాటిపోయింది. సంజీవరావును చూచిన రామయ్యగారు- హెడ్ గుమస్తా- కోపంతో కనుబొమలు చిట్లించి, కర్కశత్వం ఉట్టి పడే సహజధోరణిలో "ఏమయ్యా! ఇంత ఆలస్యంగా వచ్చావేం? టైం చూడూ! *You are late by half an hour!* ఇలా అయితే పనికిరాదు. మరోసారి ఇట్లా చేస్తే నీమీద 'డిసిప్లినరీ ఆక్షన్' తీసుకో వాల్సి ఉంటుంది"—అన్నారు.

"మా ఆవిడకు చాలా 'సీరియస్'గా ఉండటం చేత కొంచెం ఆలస్యమైంది సార్! ఈ సారి క్షమించండి!" అని ఆపద్ధర్మంగా బొంకాడు సంజీవరావు.

"నీ ఒక్కడికే కాదయ్యా! మా అందరికీ వున్నారు పెళ్ళాం బిడ్డలు. ఇల్లు ఇల్లే! కోర్టు కోర్టే! నీలాగే ప్రతి గుమాస్తా రోజూ లేటుగా వచ్చి, 'సార్! నాభార్యకు సీరియస్‌గా వుంది!' 'సార్! నాకొడుక్కి కడుపులో తలనొప్పి పుట్టింది' అంటో కుంటిసాకులు చెబితే ఇక్కడ పని సాగేదెట్లా? 'పంక్చుయాలిటీ' అన్నది లేకపోతే పని చెయ్యటం చాలా కష్టం!" అని మండిపడ్డాడు హెడ్ గుమాస్తా.

సంజీవరావు వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు. తన ముందు ఫైలులూ, కేసులూ కొల్లలు! కొల్లలు!

ఆనాడు అతనికి పనిచెయ్యడానికి మనస్కరించలేదు. ఏదో బాధతో, అవమానంతో, భయంతో అతని గుండెలు తీవ్రంగా కొట్టుకోసాగాయి. ముఖం మీద చెమటబిందువులు ముత్యాల తోరణాలు కట్టినై. గొప్ప 'ఇన్‌కన్వీనియన్స్'గా వుంది. దీనికి తోడు కడుపులో చిట్టెలుకలు పరుగులు పెడుతున్నయ్. ఉదయం పరగడుపున ఓ కప్పుకాఫీ ఏం త్రాగేడో అంతే! ఆ తర్వాత ఓ గ్లాసెడు మంచి నీళ్ళయినా పుచ్చుకోలేదు.

ఛీ! వెధవ బ్రతుకు!

అది డిస్ట్రిక్టు కలెక్టరుకోర్టు. అందులో తనబోటి వాళ్లు కొన్నివందల మంది పనిచేస్తున్నారు. యువకులూ, వృద్ధులూ, సన్మార్గులూ, దుర్మార్గులూ— భిన్నభిన్న వయస్కులు — భిన్నభిన్న తత్వాల వ్యక్తులు పనిచేస్తున్నారు. అయితే వచ్చిన చిక్కల్లా ఎక్కడ వుందంటే—సంజీవరావు కూర్చున్న కుర్చీ తన ఇన్‌ఛార్జికి మరీ ఎదురుగా వుండటంలో. ఏతత్ కారణంబున అతను బయటకుపోయి కాసేపు గాలి షికార్లు సేవించడానికి కాని, కుప్పలు కుప్పలుగా పడివున్న ఫైలు కట్టలమధ్య దాక్కుని తక్కిన గుమాస్తాలతో లోకాభిరామాయణం పారాయణ చేయటానికి కాని వీల్లేదు.

హెడ్ గుమాస్తా రామయ్యగారు స్వతః మంచివారు. ముప్పై సంవత్సరాలు 'నిష్కళంకమైన' సర్వీస్ చేశారు. బహు కుటుంబి కావటంచేత ఆయనకు ఈ లోకంలోని చికాకులూ, కష్టనష్టాలూ క్షుణ్ణంగా తెలుసు. ఐనప్పటికీ ఆయన చాలా కటువుగా మాట్లాడతారు. ముఖంచిట్లించి, కళ్లుచిన్నవిగా చికిలించి ఎదుటి మనిషిని హడలకొట్టేసే విద్యలో పండితుడు. అట్లా వుంటేనేతప్ప ఈ 'కుఱ్ఱకారు గుమాస్తాలు' వళ్లు వంచి పని చెయ్యరని ఆయన తన ముప్పైఏళ్ల అనుభవంద్వారా తెలుసుకున్నారు. అంతే! కాని, ఆయన 'నిండుమనంబు నవ్య నవనీత సమంబు' ఏం చివాట్లుపెట్టినా ముఖ మెదురుగానే అంటాడుకాని—మనిషి వెనుక గోతులుత్రవ్వటమూ, అయినదానికీ, కానిదానికీ పై అధికార్లతో రిపోర్టులు చెయ్యటమూ అతనికి తెలియని విషయాలు.

రామయ్యగారికి సంజీవరావుమీద ఓ ప్రత్యేకమైన సదభిప్రాయం వుంది. గత నాలుగేళ్లనుండీ సంజీవరావు రామయ్యగారిక్రిందనే పనిచేస్తున్నాడు. అతను ఓ యంత్రంలాంటి మనిషి. తనూ, తనపనీ తప్ప అతనికి వేరే ప్రమేయమే వుండదు. లోకం ఒక్కసారిగా నశించిపోయినప్పటికీ అతను తనకు కాదన్నట్టుగానే వ్యవహరిస్తాడు. మరోకారణం కూడా రామయ్యగారిని ఆకర్షించింది. అది సంజీవరావుప్రవర్తన. తక్కిన గుమాస్తాల మల్లే సంజీవరావు బీడీలూ, చుట్టలూ, సిగరెట్లూ కాల్చడు. కాఫీ హోటళ్లకు వెళ్లడు. గర్వంతో, అహంభావంతో రొమ్ము విరుచుకుని తిరగడు. తలవంచుకొని కోర్టుకే

రావడమూ, తలవంచుకునే ఇంటికిపోవడమూతప్ప—తనవెనుక ఓ చిన్న హైడ్రోజన్ బాంబు పడినప్పటికీ తిరిగి చూడడు.

ఏవంవిధ గుణగణగరిష్ఠుండైన సంజీవరావు ఈనాడు లేటుగా రావటమూ, వచ్చినతర్వాతఅయినా తనపని తాను చూచుకోకుండా స్థాణువులా కూర్చుని వుండటమూ గమనించిన రామయ్యగారికి కొంత ఆశ్చర్యం కలిగింది. తనపని తాను చూచుకుంటూనే మధ్యమధ్య ఓరచూపుల్తో ఆయన సంజీవరావును గమనిస్తూనే వున్నాడు. సంజీవరావు ఓ కేసు విప్పి దాన్ని చదివి అర్థం చేసుకోవాలని ప్రయత్నించాడుకాని విఫలుడైపోయాడు. ఉహూఁ! మరో కేసు పుచ్చుకున్నాడు. ఉహుహూఁ!

వివిధమైన ఆలోచనలతో అతని బుఱ్ఱ వేడెక్కిపోతోంది.

అతను మనిషై పుట్టినప్పటికీ 'పశువు'గానే పెరిగాడు. తన తండ్రి ఓ ప్లీడరు గుమాస్తాగా పనిచేసినప్పటికీ ఆ వృత్తిలో ఆట్టే రాణించలేక పోయాడు. నందిని పందిగా పందిని నందిగా మార్చే తెలివితేటలు లోపించినకారణంచేత ఆయన కొంచెమైనా ఆర్జించలేకపోయాడు. అందుచేత సంజీవరావు విద్యార్థిదశలో వున్నప్పుడైనా ఖరీదైనబట్టలు వేసుకోవటమూ, పెద్ద పెద్దవాళ్ళ అబ్బాయిలతో స్నేహంగా వుండటమూ ఎరగడు. ఆతర్వాత స్కూల్ ఫైనల్ పాస్ చెయ్యటమూ, తన తండ్రి వాళ్ళనూ, వీళ్ళనూ ఆశ్రయించి కోర్టులో గుమాస్తాగా వేయించడంతో అతను పూర్తిగా యంత్రమైపోయాడు.

తాను మనిషిననీ, మనిషి అన్న ప్రతివాడిలోనూ అంతరాత్మ అనే పదార్థం ఒకటి వుంటుందనీ, ఆ 'పదార్థం' అస్తమానమూ సౌఖ్యం అనుభవించాలని కోరుతుందనీ, బ్రతికిన నాల్గునాళ్ళూ వైభవంగా జీవించాలనీ అతనికి తెలీదు.

దుఃఖం అన్నది రూపం మార్చుకున్న కాలకూటవిషంతప్ప మరోపదార్థంకాదనీ, అది మనిషిలో ప్రవేశించాక నిలువునా క్రుంగదీసి కృశింపజేస్తుందనీ కూడా అతనికి సరిగా తెలీదు.

ఐతే, ఈనాడు తనకావిషయాలు కొంచెం కొంచెం గుర్తువస్తున్నాయి.

అతను ఆలోచనా సముద్రంలో మునిగి తేల్తున్నాడు.

"ఈ కోర్టులో—ఆ మాటకువస్తే, ఈ 'చతురంభోధి పరీతమైన ధరణీ చక్రంబు' లో ఒక్కరికీ లేని ఈ బాధా, ఈ కష్టాలూ నా కొక్కడికే యెందుకు కలగాలి? ఏం? నేను మనిషిని కానూ? వీళ్ళందరి మల్లే పుట్టలేదూ? వీళ్ళందరూ హాయిగా, ఉల్లాసంతో కేరింతలు కొడుతూ, ఎగిరి గ్రుల్లిపడుతోంటే—నేనొక్కణ్ణీ యిట్లా స్థాణువునై రాతి బొమ్మలాగు అధోలోకాలలోకి దిగజారి పోతున్నానేం? నాకు జీవితం తక్కువా? పరువు ప్రతిష్ఠలు తక్కువా? ఏంవిటి తక్కువైందని చెప్పి నేనిట్లా ఉసూరుమంట్లో రోజు లీడుస్తున్నాను?"

ఈసారి అతని మనస్సు తన కుటుంబంమీదికి—కోపంతో ఉడుకెత్తి—పరుగెత్తింది:

"ఎంతకాలం? ఎంతకాలమని నేనీ బరువు మొయ్యగలను? ఒకరా? ఇద్దరా? వెరసి ఆరుగురు జనాభా. మా ఆవిడ చెప్పినట్టు 'రోజుకు పన్నెండు కంచాలు లేవాలి'? వీళ్లందరికీ ఎక్కడనుండి తెచ్చేది? కరువుచూస్తే ఇట్లా మండిపోతోంది. బజారుకు వెడితే కళ్లనుండి నెత్తురు చుక్కలు పడుతున్నయ్. ఇంతాఏడుస్తే వీళ్లకు నామీద అభిమానమా? చట్టుబండలా? ఇవ్వాళటి కివ్వాళ నేను తిండీ తిప్పలూ లేకుండా ఇలా కడుపుమంటతో కోర్టుకు వచ్చేస్తోంటే, ఒక్కరన్నా అడ్డువచ్చి 'ఇంత ఎంగిలి పడిపోరా! ముదనష్టపాడా!' అనగలిగారూ? ఎబ్బే! ఎందుకంటారూ? నా వంతుభోజనం కూడా మిగులుతే ఒక్కొక్కళ్లూ మరి రెండేసి ముద్దలు ఎక్కువ తినొచ్చుగా! వీళ్ళందరినీ పెంచుతానని నేను కంట్రాక్టు రాశానా? 'అమ్మోయ్! నిరాహారంగా అలాగే పోతున్నాడే!' అని కనికరించటంలేదు సరిగదా.—వీళ్ళందరికీ గొంతెమ్మ కోర్కెలు! ఒకరికి శుభ్రమైన లంకపుగాకుచుట్టలు ఓ వంద కావాలి! అందులో కాడలుండకూడదు! మరో ఆవిడకి రెండు రామబాణం మార్కు సైనుపంచెలు! ఇంకో ఆవిడకు కంపల్సరీగా ఫైవ్ పండిట్స్ నోట్సుకొని తీరాలి! వీళ్లైతే ఒకటో రెండో వాయల్ చీరెలుకూడా కొనాలి! ఇది అప్షనల్! తెచ్చిన జీతం డబ్బులు తిండికే చాలీ చాలనట్టుంటే—వీళ్ళందరికీ చదువులూ చట్టుబండలూను!

అన్నీ వేషాలు! జరిగివస్తే జ్వరం వచ్చినంత సుఖమే లేదు. ఇక్కడేమీ డబ్బు కుప్పపోసి వుంచలేదు—కుంచాలతో కొలిచి దానం చెయ్యటానికి. 'ఏదో! ఈ కరువుకాలంలో ఇంత పెద్దకుటుంబాన్నీ గుట్టుగా ఈడ్చుకవస్తున్నాడు. అంతే చాలులే!' అన్న జిజ్ఞాస ఏ ఒక్కరికన్నా వుందా?"

ఈసారి, తన భార్యవైపు ప్రసరించిన మనస్సు కోపంతో ఉడుకెత్తలేదు—జాలితో ద్రవించి, ఏరై, నదియై, సముద్రమై కెరటాలు చాచి, కెరట్లు విరిగి, పరవళ్లు త్రొక్కింది:

"స్వర్ణ! అన్వర్థనామధేయురాలు! అనగా, బంగారంవంటి మనిషి. ఏం లాభం? ఈ దరిద్రుణ్ణి పెళ్లాడి తనూ దరిద్రురాలైపోయింది. నే నేనాడైనా దానికి—వెండి బంగారాల సంగతి సరే సరి!—ఓ మంచి చీర అయినా కొనగలిగానా? కన్నారే మిస్తున్నారో, అంతే! అదయినా, 'నా కదికావాలి! ఇది కావాలి!' అని నన్నెన్నడైనా అడిగిన పాపాన పోయిందా? ఎలా అడుగుతుందీ? నా దగ్గర ఏం మిగుల్తోందని అడుగుతుందీ? ఈపాటి జ్ఞానం తక్కిన వాళ్లకుకూడా వుంటే ఎంత సంతోషించేవాణ్ణి! ఆ చంటిదానికి కడుపులో 'బల్ల' పుట్టింది. పిల్ల 'నానాటికి తీసికట్టు నాగంభొట్టూ' అవుతోంది. ఏ లివర్ క్యూర్‌రో వాడుదామా అంటే డబ్బేదీ? నెలజీతం వారంరోజులకే సరిపడక ఊరినిండా వందలూ, వేలూ అప్పులు పెరుగుతోంటే డబ్బు మిగిలే దెప్పుడు? మందు వాడే దెప్పుడు? ఉష్ష్! ఎంతకాల మీ దరిద్రం? దీనికి అంతం అనేది లేనట్టే వుంది!"

సంజీవరావు మస్తిష్కంలో తుఫానుగాలులు చెలరేగినై. వాటిధాటికి అతను తట్టుకోలేక పోతున్నాడు. తన హృదయాన్ని ఏదో ప్రచండమైన ఓశక్తి కదిలించి, కుదించి, ఊపివేస్తున్నట్టుగా అతను దద్దరిల్లిపోతున్నాడు.

ఈ దద్దరిల్లిపోవటాన్ని రామయ్యగారు గుర్తిస్తున్నారు.

మధ్యాహ్నం ఒంటిగంట అయింది. (ఆనాడు ఒకటోతారీఖు అన్న సంగతి పాఠకోత్తములు విస్మరించారా?) సంజీవరావు సహోద్యోగులందరూ ఒకొక్కరే ట్రెజరీకివెళ్లి జీతా లందుకుని వస్తున్నారు. కేరింతలతో, కేకలతో, నవ్వులతో గదులన్నీ ప్రతిధ్వనిస్తున్నయ్.

కాలచక్రం ఆగలేదు.

రెండుగంటలైంది. ప్రతిరోజూ ఆవేళప్పుడు ఇంటినుండి ఫ్లాస్కులో తెచ్చుకున్న కాఫీ త్రాగటం అలవాటు. ఆనాడుకూడా అలాగే కాఫీ జ్ఞప్తికివచ్చి, లేచి అలమారుతాళం తీశాడు. ఫ్లాస్కులేదు. అ లేక పోవడంతో అతనికి తను కాఫీ తేలేదన్నవిషయం తెలిసింది. ఈ సంఘటనతో ఆతనిలోని 'బాధ' ద్విగుణీకృతమైంది. ఇంట్లోవాళ్ళనందరినీ అమాంతం నమిలి మ్రింగాలన్నంత కోపం వచ్చింది.

"అబ్బాయ్!" అని రామయ్యగారు కేక వెయ్యడంతో అతను త్రుళ్లిపడి, ఊహాలోకంనుండి భౌతిక విశ్వంలోనికి ఊడిపడ్డాడు. "జీతం అందుకున్నావా?"

"లేదు" ఉదాసీనంగా, నిర్లిప్తతతో జవాబిచ్చి మళ్లీ ఊహాలోకానికే ప్రయాణించాలని చూస్తోండగా రామయ్యగారు "నాతో రా!" అన్నారు. కరడుకట్టిన ఆయనముఖంలోవున్న భావం కోపమో అభిమానమో కూడా అర్థం కావటంలేదు.

అది మేడపై అంతస్థులో ఓగది. రామయ్యగారు మేడమెట్లు దిగుతోండగా — కసాయివాణ్ణి అనుసరించే మేకపిల్లలా — సంజీవరావు ఆయన్ని అనుసరిస్తున్నాడు. నడుస్తున్నంతసేపూ అతనిగుండెలు గుండెల్లో లేవు. గంభీరంగా 'పోజ్' పెట్టిన రామయ్యగారినిచూచి "ఇవ్వాళతో నాపని సరి! రామయ్యగారు ఏ కలెక్టరుతోనో, డిప్యూటీతోనో రిపోర్టు చెయ్యటానికే నన్ను తీసుకవెడుతున్నారు" అని కంగారుపడిపోతున్నాడు.

ఐతే, అదృష్టవశాత్తూ అటువంటిదేమీ జరగలేదు. రామయ్యగారు కోర్టు ఆవరణలోనే ఓమూలకు తీసుకవెళ్లారు సంజీవరావును. అక్కడ ఎవరూ లేరు. ఓ చిన్న వేపచెట్టునీడలో ఓ సిమెంటుబెంచి వేయబడి వుంది. రామయ్యగారు సంజీవరావునుచూచి "కూర్చో, నాయనా!" అన్నారు.

ఆ కంఠంలోని మార్దవం చూచి సంజీవరావు తనను తనే నమ్మలేకపోతున్నాడు. రామయ్యగారు "పెద్దపులి" అన్న బిరుదు సంపాదించుకున్నవ్యక్తి.

ఆయనలో దయాదాక్షిణ్యాలు ఏకోశానా లేవని అందరికీ తెలుసు. అటువంటివ్యక్తి స్వరంలో మార్దవం తొణికిసలాడుతోందంటే నమ్మడమెట్లా? పైగా ఆ స్వరంలో ఏదో ప్రేమ—లేకపోతే అభిమానం—కూడా లేకపోలేదు.

ఆ యిద్దరూ ఓ బెంచీమీద కూర్చుచున్నారు.

గుబురుగా పెరిగిన వేపచెట్టు ఆకులమధ్యనుండి ప్రసరిస్తున్న సూర్యకిరణాలు అంత తీక్ష్ణంగావున్నట్టు లేవు.

"నాయనా! అలా వున్నావేం?" అన్నారు రామయ్యగారు.

"ఎట్లా వున్నానూ?" అన్న అర్థం స్ఫురించేట్టు చూశాడు సంజీవరావు.

"వంట్లో బాగులేదా?"

"బాగానే వుంది."

"ఇంట్లో అంతా క్షేమంగానే వున్నారా?" రామయ్యగారి ఈ విధమైన ప్రశ్నలవల్ల కొంత తొట్రుపాటు కల్గింది. "నా సంగతులన్నీ ఈయనకెందుకూ? ఆర్చేవాడా? తీర్చేవాడా?" అనుకుని మనస్సులో బాధపడ్డాడు.

అది గమనించారు రామయ్యగారు.

"అబ్బాయీ! నన్ను మరోవిధంగా అనుమానించకు. నేనూ మనిషినేనయ్యా! పెద్దపులిననో, సింహాన్ననో అనిమీరు నన్నుగురించి అనుకుని, అపోహపడటం సబబుగానే వుందికాని—ఇది ఉద్యోగధర్మమోయ్! నేనే మెత్తగా మంటిపాములా ఊరుకుంటే మీరు వళ్లువంచి పనిచేస్తారూ? 'తా గుట్టక యున్న తేలు గని కుమ్మరి పుర్వని యందురే కదా!' అన్నాడు వెనుకటికో కవీశ్వరుడు. నేనెట్లాంటివాడినో మీ నాన్నగారి నడుగు, చెబుతారు. ఆయనా నేనూ కలిసి చదువుకున్నాం—చిన్నప్పుడు..అసలు, ఏమైంది? నీలో ఏదో బాధ కలిగింది. నాదగ్గర దాచకు. ఇటు చూడూ! మనలోని బాధలు మనలోనే వుంచుకుని మథనపడటంకంటె—మనకు ఆప్తులైన ఒకరిద్దరి దగ్గర వెళ్లబోసుకోవడం మంచిది. కొంత హృదయభారమన్నా తగ్గుతుంది."

"ఎబ్బే! ఏమీలేదండీ! మనస్సు కొంచెం కలతగావుంది. అంతే!" అన్నాడు సంజీవరావు.

"ఇటు చూడు నాయనా! ఇది ఏభైరెండేళ్ల పండిపోయిన జుత్తుమాత్రమేకాదు—పండిన అనుభవం! ఈ ముప్పైఏళ్ళ సర్వీసులోనూ నే నెన్నిదశలో దాటాను. ఎన్ని అనుభూతులో పొందాను. ఎన్నిరకాల మనస్తత్వాలనో చూశాను. నీ బాధ ఏమిటో చెప్పు! సంశయించకు!" అని అమృతం ఉట్టిపడే మాటలతో సాంత్వనపరిచారు రామయ్యగారు.

సంజీవరావు యిన్నాళ్లకు రామయ్యగారిలో ఓ విలక్షణమైన సరిక్రొత్త వ్యక్తిని చూడగలిగాడు. ఓహో! ఈ పెద్దపులి పంజాలలో వున్నది కర్కశత్వంకాదు—నవనీత మృదుత్వం! ఈ నల్లతాచు కోరలో వున్నది కాలకూటంకాదు — నవనీత మృదుత్వం!

అతను తన హృదయావేదనను రామయ్యగారి ముందు వెళ్ళబోసుకున్నాడు. రామయ్యగారు, విని, నవ్వారు. "ఇంతేనా? ఈపాటి కష్టాలకే యింత సతమత మైపోతున్నావా?" అన్నారు.

"ఇట్లా నవ్వుతారనే నేను మొదట్లో చెప్పనన్నాను. ఏం చేసేది? ఈ దరిద్రబాధతో నేను క్రుంగిపోతున్నాను. విచారాలతో తిన్న తిండి వంటబట్టడంలేదు—రాత్రులు సరిగా నిద్రకూడా పట్టదు. ఊరునిండా అప్పులు! ఏ నెలజీతం ఆ నెలకే చాలక ప్రతినెలా పదీ పాతికా క్రొత్త అప్పులు చేయాల్సివస్తోంది. వడ్డీలు కట్టేసరికి నాతాతలు దిగివస్తున్నారు.

ఇదివరలో చేసిన అప్పులే తీర్చకపోతే-క్రొత్త అప్పులు ఇచ్చేదెవరు? ఈ అప్పులవాళ్ల వత్తిడి నానాటికీ దుర్భరమైపోతోంది. పోనీ, నాకేమైనా దురభ్యాసాలున్నాయా అంటే అదీలేదు. బీడీ, సిగరెట్ వగైరాలు కాల్చనే కాల్చను సరికదా — ఓ కాని యిచ్చి కిళ్ళీముక్క అయినా వేసుకోను. నాకెందుకీ శిక్ష? ఎన్నాళ్లని?"

"అప్పులెంతవరకు వున్నయ్?"

"ఇప్పటికి నాలుగు వందల పైచిలుకు"

"సరే! ప్రస్తుతానికి ఓ వందయిస్తున్నా. తీసుకుని, మరీ వత్తిడి చేస్తున్న వాళ్ల రుణాలు తీర్చు!" అని పది—పదిరూపాయల నోట్లు లెక్కపెట్టి సంజీవరావు చేతిలో వుంచారు రామయ్యగారు. సంజీవ

రావు చేతులు హత్యచేయబోయేవాడి చేతులు మల్లే వణికిపోసాగాయి. చేతులు వెనక్కి తీసుకున్నాడు.

"క్షమించండి! నన్ను మీ రపార్థం చేసుకున్నారల్లేవుంది. ఉచితంగా స్వీకరించటానికి నా మనస్సు ఒప్పుకోదు" అన్నాడు.

"తీసుకోవయ్యా! పోనీ అప్పుగా యిస్తున్నాననుకో!" అన్నారు రామయ్యగారు.

గత్యంతరం లేని సంజీవరావు ఆ వందరూపాయలూ స్వీకరించాడు. దానమో, రుణమో—ప్రస్తుతానికి ఆ డబ్బు అతనికి అత్యవసరంగా కావాలి! అర్జంటుగా తీర్చాల్సిన రుణాలు కొన్ని వున్నాయి.

"జీతం అందుకోలేదేం ?" అని రామయ్యగారు ప్రశ్నించటంతో, "జీతమా?" అన్నట్టు రామయ్యగారి కళ్లలోకి చూచి "ఏదో పరధ్యానంలో పడిపోయి జీతం సంగతే మరచిపోయాను" అని జవాబిచ్చి, "వెళ్లొస్తా!" అని అయినా చెప్పకుండానే చకచక ట్రెజరీ వైపు నడచిపోయాడు సంజీవరావు.

"ఇంత అమాయకుడు ఈ మాయ ప్రపంచంలో ఎలా జీవించగలడో తెలీదు. కష్టాలతో యితని మనస్సు కదలిపోయింది. "అనుకుంటూ ఆఫీసు గదిలోకి పోయారు—రామయ్యగారు. అప్పటి ఆయన ముఖంలో ఓ పవిత్రకాంతి తళుకుమున్నది.

సంజీవరావు తన ఎనభై రూపాయల జీతమూ, రామయ్యగారిచ్చిన వందరూపాయలూ కోటుజేబులో వుంచుకుని, తిరిగి తన స్థానానికి పోయి—ఉదయం నుండి పనిచెయ్యని కారణంచేత త్వరలోనే తన పనిలో నిమగ్నుడై పోయాడు.

సాయంత్రం అయిదయింది. గుమాస్తాలందరూ వెళ్ళిపోయారు. ఆఫీసులో వున్నది సంజీవరావూ—ఇద్దరు బంట్రోతులు మాత్రమే. వాళ్లుకూడా ఇంటికి పోవలసిందేకాని—అతను పనిచేస్తున్న కారణం చేత అంతవరకూ ఆగిపోవాల్సి వచ్చింది.

చూచి, చూచి "బాబూ! అయిదయిపోయింది!" అన్నారు బంట్రౌతులు. అతను హఠాత్తుగా తలపైకెత్తి గోడ గడియారంవైపు చూశాడు. ఐదుంబావైంది. త్వరత్వరగా కాగితాలన్నీ ఫైల్సులోకట్టి, డ్రాయరుకూ, అలమారుకూ తాళాలు వేసి, "భద్రంగా తలుపులూ, కిటికీలూ మూసి తాళాలు వెయ్యండి!" అని, ఆఫీసునుండి బయటపడేసరికి ఐదున్నర అయింది.

కాలచక్రం అతివేగంగా తిరిగిపోతోంది! తన కడుపులో ఆకలి దహించుకపోతోంది.

తన తండ్రికి చుట్టలూ, గంగా భాగీరథీ సమానురాలైన అక్కగారికి సైను పంచెలూ, చెల్లెలికి ఫైవ్ పండిట్స్ నోట్సూ కొనాల్సివుంది కనుక బజారువైపు త్రోవతీశాడు. ఆకలి సహించలేక ఓ కాఫీ హోటల్లో దూరాడు. అతను హోటల్ కు వెళ్లి ఏ రెండేళ్ళో, మూడేళ్లో అయివుంటుంది. ఈ కాఫీ హోటళ్లన్నా, అందులోని పదార్థాలన్నా అతనికి అసహ్యం! ఐనప్పటికీ 'ఆపద్ధర్మం' గా హోటల్ లో అడుగుపెట్టాడు.

ఆకలికొద్దీ అతను రకరకాల స్వీట్సూ, కారపు పదార్థాలూ కడుపు పట్టినంతవరకూ తిని, ఒక కప్పు ఓవల్ టిన్ పుచ్చుకున్నాడు. సర్వరు రూపాయి బేడకు బిల్లు ఇచ్చాడు. ఆ బిల్లుచూచి అతనాశ్చర్యపోయి, హడలెత్తిపోయాడు. ఎంత ఘోరం! ఒక మనిషి టిఫిన్ ఖరీదు రూపాయి రెండణాలా? ఎంత దారుణం!

హోటల్ మానేజరు దగ్గరకువెళ్లి, బిల్లు అతని చేతిలో వుంచి, డబ్బుకోసం కోటుజేబులో చేయి వుంచాడు.

భగవంతుడా! నీ హృదయం ఎంతటి శిలామయం కాకపోతే నిన్ను రాతి విగ్రహంగా మలుస్తారు!

జేబులో డబ్బులేదు. అసలా జేబుజేబుగాలేదు. కత్తిరించబడివుంది.

"ఆఁ!" అని అతను అరచిన అరుపును ఏ కాళిదాసో అయివుంటే ఒక మహాకావ్యంగా వర్ణించి వుండేవాడు. ఆ అరుపులో ఎంత బాధ! ఎంత బాధ!

ఐనప్పటికీ ఆశకొద్దీ అతను తిరిగి తను టిఫిన్ చేసిన స్థలందగ్గరకు వెళ్లి వెతికాడు. పిచ్చికాకపోతే, జేబు కత్తిరించబడ్డ తర్వాతకూడా ఇంకా వెదుకుతాడా? తిరిగి మానేజరు దగ్గరకు వచ్చేసరికి అతని శరీరం వణుకు పుట్టుకుంది.

"క్షమించండి! నా జేబెవరో కత్తిరించేశారు. నూటఎనభై రూపాయలు కొట్టేశారు. అరగంటలో వచ్చి మీ డబ్బు మీకిస్తాను" అన్నాడు.

మా మేనేజరు మంచివాడే! కాని, క్రమశః అతనిలో దయాదాక్షిణ్యాలు ఎండిపోయినై. అతనికి ప్రతిరోజూ కనీసం అయిదారుసార్లన్నా యిలాంటి సంఘటనలు తటస్థపడుతుంటవి. మనీపర్సులు పోయినట్టు కొందరూ, ఇళ్ళవద్ద డబ్బు మరిచినట్టు కొందరూ, జేబులు కత్తిరించబడ్డట్టు మరికొందరూ చెబుతుంటారు.

ఇటువంటి సంఘటనలలో సత్యాసత్య నిర్ణయం చేయబూనుకుంటే తాను హోటల్ నడిపినట్టే!

"అవన్నీ పనికిరావు. ముందు డబ్బక్కడ పెట్టు! కదిలావంటే గూబ కదలేస్తాను!" అని హుంకరించాడు మా మేనేజరు.

హోటల్‌లో కూర్చుని, రేడియో సంగీతం వింటూ, అరకప్పు కాఫీ రెండున్నర గంటలసేపు సేవించే పెద్దమనుషులు ఫక్కుమని నవ్వారు.

దొరకనంతవరకూ ప్రతి దొంగా దొరగానే చెలామణీ అవుతాడు.

పాపం! సంజీవరావు! డబ్బు పోయినందుకే ఏడుస్తాడా? అవమానం జరిగినందుకే దుఃఖిస్తాడా?

"నిజమండీ! నే నబద్ధం చెప్పటం లేదు!" కన్నీరు కారుస్తూ ప్రాధేయపడ్డాడు.

"తేరగా వచ్చిందని చెప్పి రూపాయిబేడ టిఫిన్ మెక్కావేం? డబ్బక్కడ పెట్టు. లేకపోతే, పోలీసును పిలిపిస్తా! తిన్నది కక్కిస్తా! ఖబర్‌దార్!" హుంకరించాడు దయాళువైన హోటల్ మా మేనేజరు.

ప్రపంచంలో న్యాయం నశించిపోతోంది. అన్యాయమూ, అధర్మమూ లోకాన్ని సర్వత్రా ఆక్రమించడంతో మనుష్యులు న్యాయాన్యాయాల్ని పోల్చుకోలేక తప్పటూహలు పెంపొందించుకుంటున్నారు.

"ఆకోటు విప్పు! అట్లా చూస్తావేం? ఆ వెట్టి వెట్టి ఏక్షన్లు కట్టిపెట్టు! డబ్బుతెచ్చి విడిపించుకపో! సాయంత్రంవరకూ గడువిస్తున్నా!" మా మేనేజరు తేజో దుర్నిరీక్ష్యుడు! అబ్బో!

విధిలేక సంజీవరావు కోటువిప్పి మా మేనేజరుకిచ్చాడు.

ఆ విప్పడంలో అతని చినిగిపోయిన కమీజు హోటల్‌లో ఆరగిస్తోన్న పెద్దలకంటబడ్డది. అంతా మరోమారు ఘొల్లున నవ్వారు.

అందులో ఒక కవిశిఖామణిగారు గూడుబండి నడుస్తున్నట్టు నవ్వి "తేటనీరు చెరువు అట్టడుగున పేరుకున్న బురదను తనలో దాచుకున్నట్టు— ఒకకోటు తనక్రిందవున్న చింకి కమీజు తాలూకు పరువుప్రతిష్ఠల్ని కాపాడుతుంది!" అని ఆంధ్రలోకానికి ఓ దివ్యమైన సుభాషితాన్ని అందజేశాడు.

సంజీవరావుకు గాయంమీద కారం చల్లినట్లైంది. మూర్తీభవించిన దైన్యంలా ఆ కవివైపు చూచాడు.

తిరిగి అందరూ నవ్వారు.

అబ్బా! బాధ! కనిపించని, వినిపించని బాధ!

హోటల్‌నుండి రోడ్డుమీదికి ఒక్క అంగలో వచ్చిపడి, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ ఏడుపు ముఖంతో, ఈడుపుకాళ్లతో యింటిముఖం పట్టాడు.

తన యింటి ముందు ఓ ఖాళీజట్కా నిలబడి వుంది.

ఇంట్లోపలనుండి తన చెల్లెలు హార్మోనియం మీద "ఎన్నగాను రామభజన" తోడిరాగంలో పాడుతోంది. ఇంట్లోవాళ్ళంతా ఉల్లాసంతో కేరింతలు కొడుతున్నారు.

అబ్బా!

తనెవరికోసం అష్టకష్టాలూ పడుతూ నీచాతినీచంగా జీవిస్తున్నాడో—వాళ్లకు తన జీతంతోనే కాని తనతో నిమిత్తమే లేనట్టుంది!

ఇంట్లో అడుగుపెట్టాడు.

మధ్య గదిలో— పొరుగింటివాళ్ళ దగ్గరనుండి ఎరువు తెచ్చివేసిన తివాసీలమీద—ఎవరో పరస్త్రీలు కూర్చున్నారు. తలవంచుకునే ఆ గది దాటి వంటింట్లోకి వెళ్లాడు.

ధూళిధూసరితమైన కేశాలూ, కళ్లు లోతుగా దించుకపోయిన ముఖమూ, చింకి కమీజూ చూచిన ఆ పరస్త్రీలు చీరలచెరగుమాటున కిసుక్కుమన్నారు. కిలారుమన్నారు.

సుహాసిని పాట ఆపింది.

సంజీవరావు స్వర్ణను పిలిచాడు. స్వర్ణ వంటింట్లోకి వెళ్ళింది.

"అర్థంటుగా కావాలి! నీదగ్గర రెండు రూపాయలుంటే ఇటివ్వు!" అన్నాడు. స్వర్ణ తన నాలుగేళ్ళ దాంపత్య జీవితంలోనూ మూడు రూపాయలు మిగుల్చుకుంది. అందులో రెండు రూపాయలు భర్తకిచ్చింది.

"వీళ్ళంతా ఎక్కడినుండి వచ్చారూ?" భర్త అడిగాడు.

"ఏలూరునుండి వచ్చారు—మీ చెల్లెలును అడగటానికి. వాళ్ల అబ్బాయి రైల్వేలో గుమాస్తాగా పని చేస్తున్నాట్ట! జీతం నెలకు......" భార్య సమాధానాన్ని భర్త మధ్యలో నే తుంచేశాడు.

"పొమ్మనూ! డబ్బేదీ? ఎవడో నా కోటు జేబు కత్తిరించి ఒక్కసారి నూట ఎనభై రూపాయలు కాజేశాడు."

"ఆఁ! ఇప్పుడేం చెయ్యడం? అప్పుల వాళ్లంతా ఇప్పటివరకూ యిక్కడే వున్నారు. ఇంతలో వీళ్లు రావటంవల్ల వాళ్లను ఎట్లాగో బ్రతిమాలుకుని పంపించేశాం. తిరిగి వాళ్లు రేపు ఉదయమే తయారౌతారు. పాలమనిషికి పదహారు చిల్లర యివ్వాలి. ఇంటద్దె గత మూడు మాసాలనుండీ కట్టలేదు. మొత్తం ముప్పై ఆరు. పచారీ దుకాణానికి పదిహేను పైచిలుకు ఇవ్వాలి. సెట్టి సంగతి మీ రెరగనిదేముందీ? తొందర పెడుతున్నాడు..." చెప్పుకుపోతోంది భార్య.

ప్రళయం రాబోతోందా? అతని పాదాల క్రింద భూమి అట్లా దిగజారిపోతోందేం—పాతాళంలోనికి? ఆకాశం విరిగి నెత్తిన పడుతోందేం?

రెండు చేతులతోనూ చెవులు మూసుకుని "చెప్పకు! వినలేను! వినలేను!" అని పిచ్చివాడిలా కేకలు పెట్టి, గబగబా యింటినుండి బయటపడి తిన్నగా హోటల్ కు చేరుకున్నాడు.

ఆ రెండు రూపాయలూ హోటల్ మానేజరుకిచ్చి, పద్నాలుగణాలూ, కోటూ తీసుకున్నాడు.

హోటల్ యజమాని ఒక్కసారిగా బహువచన ప్రయోగం అంకించుకున్నాడు.

"నాకు తెలుసు మీ రెట్లాగూ వస్తారని! ఈ రోజుల్లో వుండే, చూశారూ, దొంగలెక్కువైపోయారండీ! ఎవరు పెద్దమనుషులో, ఎవరు తుంటరులో తెలుసుకోవటం మహా కష్టమైపోతోంది!" అన్నాడు. వ్యాపారస్థులకు లౌకికం ఉగ్గుబాలతో పెట్టిన విద్య!

ఇదంతా గమనించి వినిపించుకునే స్థితిలో లేడు సంజీవరావు.

వెళ్ళాలి!

ఎక్కడికి?

ఇంటికి!

ఊహూఁ!

తిన్నగా ఊరి బయటకు త్రోవ తీశాడు.

అన్నీ వరిపొలాలు. సస్యలక్ష్మి పచ్చలు ఆభరణాలుగా ధరించినట్టుంది.

పెద్ద చెరువుగట్టుమీదకు వెళ్ళాడు. అది విశాలమైనది. గట్టుమీద రెండు ముసలి చింతచెట్లున్నాయి. ఒక చెట్టుక్రింద కూర్చుని అతను నిర్లిప్తతతో ప్రకృతిదేవి ఒడిలో లీనుడైపోయాడు.

అస్తమిస్తున్నాడు సూర్యుడు. పచ్చని వరిపొలాలకు మరింత సొబగు కూర్చే ఆ సంధ్యారాగంలో క్రేయిల్ కట్టి నభోంతరాళమున బారెన్ బక్షులు...' జపాశోణంబాయె పతంగ బింబము, దిశాస్తోమంబు శోభాదరిద్రాణంబాయె.'

క్రమంగా చీకట్లు లోకాన్ని సర్వత్రా ఆక్రమించుకున్నయ్. ఆ చీకటిలో అక్కడ వరిపొలాలు వున్నట్టే కనిపించడం లేదు. ఆ కాలిమలో సర్వమూ ఏకమైపోయింది.

ఇప్పుడు సంజీవరావు మనస్సు పూర్తిగా జడమైపోయింది. ఆ మనస్సులో సుఖం లేదు. దుఃఖం లేదు. ఒవిధంగా చూస్తే మనస్సే లేదు. పాంచభౌతికమైన శరీరంలో ప్రాణం మాత్రముంది. ఇది భయంకరమైన దుఃఖాతిశయంవల్ల కలిగిన నిజమైన అమనస్క స్థితి. తాత్కాలికమే!

బాగా రాత్రి అయింది. అది కృష్ణపక్షం. త్రయోదశి. మామూలైన చలి ఆ చీకటివలన మరికొంచెం ఎక్కువైనట్టు వణికిపోయాడు సంజీవరావు.

రామయ్యగారు సంజీవరావు మనోదర్పణంలో ప్రతిబింబించాడు. ఆ పవిత్రమూర్తిని కృతజ్ఞతాపూర్వకమైన స్వచ్ఛమైన కన్నీటితో అభిషేకం చేశాడు. తన దురదృష్టానికి ఆ మహానుభావుడేం చెయ్యగలడు?

గత్యంతరం లేదు. పోయి ఆయనతోనే చెప్పకుంటే! ఉహూఁ!

ఏదో ఒహటి చెయ్యాలి!

కూర్చున్నదగ్గరనుండి లేచాడు.

ఒకటి! రెండు! మూడడుగులు ముందుకు వేశాడు!

తన కుడికాలు మెత్తగా త్రాడుమల్లే వున్న ఏదో వస్తువును త్రొక్కినట్టయింది.

ఆ 'వస్తువు' కడుపు మంటతో నకనకలాడుతూ తిండికోసం బయలుదేరింది. తెలియక - కనిపించక— దానితోక త్రొక్కాడు కథానాయకుడు.

అసలే—నల్లత్రాచు! అది కోపంకొద్దీ బలమంతా కోరల్లో కేంద్రీకరింపజేసి తనను త్రొక్కి అవమానించి బాధించిన 'నరమానవుని' కాలుమీద కాటు వేసింది.

కాటు వేయటమే కాదు! ఒక చిన్న మాంసం ముక్కను చీల్చి వేసింది! త్రాచుపగ!

"చచ్చానోయ్! దేవుడా!" అని అతడు భయంతో, బాధతో, ఆవేశంతో ఊరివైపు పరుగు తీశాడు. బలంగా కాటు వేసిందేమో—ఆ విషం సెకన్లమీద అతని రక్తాన్ని విరిచేస్తోంది. కళ్లు సరిగా కనిపించడం లేదు.

ఆ పరుగులో అత డొక వేపచెట్టును ఢీకొన్నాడు. తల పగిలింది. పడిపోయాడు. ఐనప్పటికీ ప్రాణంమీది తీపి అతన్ని ఊరుకోనివ్వలేదు లేచాడు. ఒళ్లు కంపరమెత్తిపోతోంది. తలనుండి రక్తం వరవ కట్టి ప్రవహిస్తోంది.

పరుగెత్తి పరుగెత్తి ఓ మురికికుంటలో పడిపోయాడు. అందులో హరిజనులు పసుచర్మాలు ఊరబెడుతుంటారు. నీరు దుర్గంధభూయిష్ఠమైవుంది. అడుగున అంతా బురద—ఊబి. లోపలలోపలగ దిగజారిపోతున్నాడు కథానాయకుడు. ఒకటి రెండుసార్లు అంచులు పట్టుకొని బయటపడాలని చూచాడు కాని- అంచులు నానిపోయిఉండటంచేత నిష్ప్రయోజనమైంది.

విషం పూర్తిగా పనిచేసింది. తలమీది గాయంనుండి రక్తం చాలావరకు పోయింది.

అతడా మురికినీళ్లగోతిలోనే మూర్ఛపోయాడు.

ఆ మూర్ఛ తాత్కాలికమైంది కాక—అతని పాలిట శాశ్వతమైనదైంది! తెల్లారిపోయింది!

సంసారం చెయ్యలేక ఆత్మహత్య చేసుకున్నాడని లోకం ఏకగ్రీవంగా తీర్మానించింది!